సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



ఆయన నిలువెత్తు బంగారం

నాడు బాటసారుల కోసం ఏర్పాటు చేసిన కాకినాడ బంగారు చినశోభనాద్రి సత్రం నేడు దూరప్రాంత నిరుపేద విద్యార్థులకు రెండు పూటలా రుచికర భోజనం అందిస్తోంది.

8లో



విషాదంలో సీతారామ కాలనీ

తల్లి, ఇద్దరు పిల్లల హత్య ఘటనతో సామర్లకోట సీతారామ కాలనీలో నిశ్శబ్ద వాతావరణం అలముకొంది. నిత్యం సందడిగా ఉండే ఆ ప్రాంతం మూగబోయింది.

కడలిలోకి 1.78 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 1,78,415 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 5 వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7 వేలు కలిపి మొత్తం 14,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 29 అర్జీలు



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగింది. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన పోలీస్ గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు 29 అర్జీలు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో పోలీస్ అధికారులు అశ్రద్ధ వహించవద్దని ఎస్పీ సూచించారు. అర్జీల్లో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయి. ఎస్పీ కృష్ణారావు వారితో చర్చించి, సమస్య పరిష్కార చర్యలు తీసుకున్నారు.

కలెక్టరేట్ వద్ద వర్కింగ్ జర్నలిస్టుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సంఘ ప్రతినిధులు

అమలాపురం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. జర్నలిస్ట్ డిమాండ్స్ డేను పురస్కరించుకుని సంఘ నాయకులు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సంఘ రాష్ట్ర కోశాధికారి, జిల్లా కన్వీనర్ మట్టపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు, ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలపై మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బీహార్ తరహాలో ఇక్కడి జర్నలిస్టులకు రూ.15 వేల పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, సమాచార శాఖను బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు అక్రిడిటేషన్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు సంఘ ప్రతినిధులు పళ్ల సూర్యప్రకాశరావు, కడలి రాజు, హరి, బాబు తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ బషీర్, కడలి సూరిబాబు, పి.వెంకటేశ్వరరావు, రెడ్డిబాబు, ఆకుల సురేష్, భీమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి క్షేత్రంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

మూడు రోజుల పాటు విశేష పూజలు



పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న ఈఓ చక్రధరరావు, పండితులు

కొత్తపేట: కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడపల్లి క్షేత్రంలో నిత్య, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో భాగంగా శ్రావణ శుద్ధ దశమి నుంచి స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. శ్రావణ మాసం, దశమి తిథిని పురస్కరించుకుని దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు మూలవిరాట్ స్వామి వారిని, ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. సంప్రదాయబద్ధంగా దీక్షాధారణ చేసి, శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలను ప్రారంభించారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, ఋత్విక్‌వరుణ, అకల్మషహోమం, నీరాజన మంత్రపుష్పాలు జరిపారు. సాయంత్రం మృత్సంగ్రహణ, అంకురార్పణ, నవమూర్తి ఆవాహన, పంచగవ్యప్రోక్షణ, పంచ శయ్యాధివాసం, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

9న పీఠంలో శ్రావణ పౌర్ణమి

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈ నెల 9న శ్రావణ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు చేస్తారన్నారు. పీఠంలోని భవానిశంకర అష్టమ లింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వర స్వామికి తులసిదళ అర్చనలు, నవగ్రహ, నక్షత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బడి పంతుళ్లకు పస్తుల పాఠం

- పొజిషన్ ఐడీ రాక.. రెండు నెలలుగా మంజూరు కాని వేతనాలు
- బదిలీ అయిన ఉపాధ్యాయులకు నేటికీ కేటాయించని ఐడీలు
- జీతాల కోసం ఎదురు చూస్తున్న టీచర్లు
- ఉమ్మడి జిల్లాలో తీవ్ర ఒత్తిడిలో 1,500 మంది

బతక లేక బడిపంతులనేది ఒకప్పటి నానుడి. ఆ రోజులను మళ్లీ కళ్లెదుట కదలాడేలా.. ఆ దుర్భర పరిస్థితులను నిజం చేసేలా వ్యవహరిస్తోంది కూటమి సర్కారు. సమాజాన్ని గాడిలో పెట్టే పాఠాలు బోధించాల్సిన బడి పంతుళ్లు ప్రస్తుతం కాలే కడుపుతో అలమటిస్తున్నారు. పదోన్నతులు వచ్చాయని ఆనందపడాలో.. నెల జీతం చేతికందడం లేదని బాధ పడాలో అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకటో తేదీ వస్తే.. కుటుంబ పోషణ, ఖర్చులు, అప్పులంటూ నెత్తిన గంపెడు కష్టాలు మోస్తూ కాలం వెళ్లదీస్తున్న వీరు.. ఆకస్మికంగా సంపాదన నిలిచిపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. చిన్న సాంకేతిక లోపాన్ని కూడా భూతద్దంతో చూపుతూ.. కూటమి సర్కారు వీరిని కష్టాల కడలిలో నెట్టివేసింది.

రాయవరం: జీతాలు రాగానే వేతన జీవులు ప్రతి నెలా ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు, పాలు, కిరాణా తదితర ఖర్చులు చెల్లించాల్సి ఉండడం సర్వసాధారణం. ఏదైనా కారణంతో ఓ నెల ఆదాయం రాకుంటే ఎంత కష్టంగా ఉంటుందో వేతన జీవులకే ఎరుక. అటువంటిది రెండు నెలలుగా వేతనాలు రాకుంటే వారి పరిస్థితి ఏమిటో అవగతమవుతుంది.

గత వేసవిలో బదిలీలు పొందిన పలువురికి పొజిషన్ ఐడీలు కేటాయించడంలో ఏర్పడ్డ ప్రతిష్టంభనతో అనేక మంది ఉపాధ్యాయుల నెలసరి ఆదాయానికి బ్రేక్ పడింది. గత నెల వేతనాలు రాకపోగా, ఈ నెలైనా వస్తాయన్న ఆశ అడియాశే అయింది. సాంకేతిక సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందన్న విమర్శలు ఉపాధ్యాయ సంఘాల్లో వ్యక్తమవుతోంది. పొజిషన్ ఐడీలు కేటాయించి, తక్షణమే వేతనాలు చెల్లించాలంటూ ఇప్పటికే ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ధర్నాలు చేసి, అధికారులకు వినతిపత్రాలు అందజేసిన విషయం పాఠకులకు విదితమే.

1,500 మందికి పైగా..

ఈ ఏడాది మే 21న ప్రారంభించిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జూన్ 15తో ముగిసింది.



ఆందోళనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు, పదోన్నతులు చేపట్టారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పొందిన వారిలో పలువురికి పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. వాటిని సకాలంలో కేటాయించకపోవడంతో జూన్, జూలై వేతనాలను వారు నేటికీ పొందలేకపోయారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,500 మందికి పైగా ఉపాధ్యాయులు ఇలా జీతభత్యాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సమాచారం.

పొజిషన్ ఐడీ అంటే..

సాధారణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓకు సంబంధిత ఉపాధ్యాయుడి పొజిషన్ ఐడీని ప్రభుత్వం కేటాయిస్తుంది. బదిలీ కాక పూర్వం వరకు వారు రెగ్యులర్‌గా జీతభత్యాలు పొందుతున్నప్పటికీ, ప్రస్తుతం బదిలీ అయిన స్థానానికి పొజిషన్ ఐడీ కేటాయించాలి. అప్పుడే సంబంధిత ఉద్యోగి/ఉపాధ్యాయుడి వివరాలు సీఎఫ్ఎంఎస్‌లో డిస్‌ప్లే అవుతాయి. అప్పుడు మాత్రమే డీడీఓలో బిల్లు సమర్పించడానికి వీలవుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలు నూతనంగా ఏర్పడడంతో, ఇక్కడ కొత్తగా కేటాయించిన పోస్టులకు పొజిషన్ ఐడీలు కేటాయించాలి. అప్పుడు ఆ స్థానాల్లో బదిలీపై వచ్చిన వారి జీతభత్యాలకు అవకాశం ఉంటుంది. బదిలీలు, పదోన్నతులు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా.. నేటికీ అధిక శాతం ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. ఫలితంగా జూలై, ఆగస్టులో తీసుకోవాల్సిన జూన్, జూలై నెలల వేతనాలు వారికి మంజూరు కాలేదు. సాధారణంగా జీతాల బిల్లులు ప్రతి నెలా 25వ తేదీలోపు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసి, ట్రెజరీకి బిల్లు సమర్పించాలి. గత నెల 25వ తేదీలోపు పొజిషన్ ఐడీలు రానందున రెండు నెలల వేతనాలను వీరు పొందలేకపోయారు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 6,533 మంది **ఉపాధ్యాయులను** బదిలీ చేశారు. గ్రేడ్-2 ప్రధానో**పాధ్యాయులు 178** మందికి, మోడల్ ప్రైమరీ **పాఠశాల ప్రధానో**పాధ్యాయులుగా 284 మందికి, **స్కూల్ అసిస్టెంట్,** సమాన స్థాయి కేడర్ ఉపాధ్యా**యులుగా 3,298** మందికి, సెకండరీ గ్రేడ్, **సమాన స్థాయి కేడర్** ఉపాధ్యాయులుగా 2,995 **మందికి, ఫిజికల్** ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు 32 **మందికి, ఆర్ట్**/డ్రాయింగ్/క్రాఫ్ట్/మ్యూజిక్ / ఒకే**షనల్ ఉపాధ్యాయు**లు 20 మందికి స్థాన చలనం **కలిగింది.**

ప్రభుత్వ కక్షపూరిత ధోరణి



ఆన్‌లైన్ సమాచారం కావాల్సినప్పుడు ప్రభుత్వం ఆగమేఘాలపై సెకండ్ల వ్యవధిలో సమాచారం సేకరిస్తుంది. ఉపాధ్యాయుల జీతభత్యాలకు సంబంధించి సాంకేతిక సమస్యను పరిష్కరించడానికి రెండు నెలలు సాగదీశారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్షపూరిత ధోరణి వీడి వెంటనే ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి, వేతనాలను తక్షణమే చెల్లించాలి.

– పి.సురేంద్రకుమార్,
జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్,
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఫ్యాప్టో ఆధ్వర్యంలో..

వేతనాలు, ఇతర అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు శనివారం జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాయి. అనేక వినతిపత్రాలిచ్చినా పరిస్థితిలో మార్పు లేదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం పొజిషన్ ఐడీలకు చర్యలు తీసుకుని, రెండు నెలల వేతనాలను జూలై 6న సప్లిమెంటరీ బిల్లు సబ్మిట్ చేసేలా జీవో జారీ చేసింది. ఈ జీవో ఎంతవరకు అమలవుతుంది, పొజిషన్ ఐడీలు సప్లిమెంటరీ బిల్లు సబ్మిట్ గడువు ముగిసే లోపు కేటాయిస్తారా అన్నది వేచిచూడాలి.

రెండు నెలలుగా ఇబ్బందులు



నెల వేతనం రాకుంటేనే వేతన జీవులు ఇబ్బందులు పడే పరిస్థితి. నిత్యావసర వస్తువులు, ఈ ఎంఐలు చెల్లించాల్సిన పరిస్థితుల్లో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. టెక్నాలజీని అధికంగా వినియోగిస్తూ, క్షణాల్లో డేటా సేకరిస్తున్న ప్రభుత్వం.. పొజిషన్ ఐడీలు కేటాయించడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. సప్లిమెంటరీ బిల్లులు ఈ నెల 15లోపు చేసుకునేలా చర్యలు చేపట్టాలి.

– పోతంశెట్టి దొరబాబు,
జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ,
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ప్రణాళిక లోపం కనిపిస్తోంది



బదిలీలు, పదోన్నతుల సమయంలోనే పొజిషన్ ఐడీలు కేటాయించే చర్యలు తీసుకోవాలి. ఇందులో ప్రభుత్వ ప్రణాళిక లోపం స్పష్టంగా కనిపిస్తోంది. రెండు నెలలుగా వేతనాలు రాక, బ్యాంకుల్లో ఈఎంఐలు చెల్లించకపోవడంతో సిబిల్ స్కోర్ తగ్గిపోతుంది. ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. వైద్య ఖర్చులకూ ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ధీపాటి సురేష్‌బాబు,
జిల్లా ప్రధాన కార్యదర్శి,
పీఆర్‌టీయూ,
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జీతాల బట్వాడా

సాక్షి ఇంపాక్ట్

అమలాపురం టౌన్: వివిధ డిమాండ్లతో నిరసనకు దిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న జూన్, జూలై నెలల జీతాలు పడ్డాయి. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలపై ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి, తొలుత పెండింగ్‌లో ఉన్న వారి జీతాలను సోమవారం బట్వాడా చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కేశవకుమార్ ఆనందం వ్యక్తం చేస్తూ, మిగిలిన సమస్యలపై కూడా విద్యా శాఖ స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో 122 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలలూ వేతనం ఇవ్వాలని, తమను 100 కిలోమీటర్లు పైబడి బదిలీలు చేయడం, కొందరిని ఏకోపాధ్యాయ పాఠశాలల్లో హెచ్ఎంలుగా బదిలీ చేసి, యాప్‌ల భారం మోపడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

18 నుంచి 'సామవేదం' ప్రవచనాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సరస్వతీ గానసభ ఆధ్వర్యాన ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. 'సనాతన ధర్మం – శాశ్వత న్యాయం' అనే అంశంపై స్థానిక సూర్య కళా మందిరంలో ఆయన ప్రవచనం చేస్తారని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రవచనాలు ప్రారంభమవుతాయన్నారు.

అన్నదాత సుఖీభవలో రైతులకు మోసం

- రూ.40 వేల స్థానే రూ.5 వేలతో సరిపుచ్చిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ధ్వజం
- కలెక్టరేట్ వద్ద పార్టీ శ్రేణుల నిరసన





కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జగ్గిరెడ్డి, విశ్వరూప్, విజయలక్ష్మి, వేణుగోపాలరావు, సూర్యనారాయణరావు ఇజ్రాయిల్ తదితరులు, కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

అమలాపురం రూరల్: రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకాన్ని 2024 జూన్ నుంచి అమలు చేసి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. రెండేళ్లకు ప్రతి రైతుకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. పార్టీ రైతు నాయకులతో కలిసి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఏడు లక్షల మందికి ఈ పథకాన్ని కోత పెట్టారని, పీఎం కిసాన్ యోజనతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. బఫర్ స్టాక్ నిర్వహణ లోపం కారణంగా యూరియా ధరను వ్యాపారులు పెంచేస్తున్నారని, యూరియా బస్తాకు బ్లాక్ మార్కెట్లో రూ.60 నుంచి రూ.100 అదనంగా డిమాండ్ చేస్తున్నారన్నారు. ఉచిత పంటల బీమాను రద్దు చేశారని, గతేడాది ఇన్సూరెన్స్ చెల్లించకపోవడంతో రైతులకు బీమా సొమ్ము అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని కూడా తొలగించారని, గిట్టుబాటు ధర లభించడం లేదని, రైతులు తమ పంటను రోడ్డుపై వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధి అమలు చేస్తే, ఆ పథకాన్నీ ఎత్తివేసి రైతులను కష్టాలపాలు చేశారన్నారు. ఉచిత పంటల బీమాను అమలు చేయాలని, గతేడాది అన్నదాత సుఖీభవ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు పినిపే విశ్వరూప్, పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, అమలాపురం, రామచంద్రపురం నియోజకవర్గాల కో–ఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాశ్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిన్నూరి రామారావు(బాబి), రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, పితాని బాలకృష్ణ, ఐటీ విభాగం అధ్యక్షుడు తొరం గౌతం, నాతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా శక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తాం

ఫ్యాప్టో జిల్లా శాఖ ప్రకటన

అమలాపురం టౌన్: ఉన్నత పాఠశాలల్లో విద్యా శాఖ నిర్వహిస్తున్న విద్యా శక్తి కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా చేయాలని విధి విధానాలు ఉన్నా, ప్రధానోపాధ్యాయులే నిర్వహించాలని ఒత్తిడి తేవడం సమంజసం కాదని ఫ్యాప్టో జిల్లా శాఖ చైర్మన్ ఎంటీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు అమలాపురంలో సోమవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని కొంత మంది విద్యా శాఖాధికారులు ప్రధానోపాధ్యాయులను విద్యా శక్తి కార్యక్రమాల నిర్వహణకు నిర్బంధం చేయడం తగదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ కార్యక్రమం జూలై 31 నాటికి పూర్తయిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా చేస్తే అభ్యంతరం లేదని, నిర్బంధంగా సాయంత్రం పూట అదనపు సమయం కేటాయించాలని ఆదేశించడం సరికాదన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు పదో తరగతికి ఉదయం, సాయంత్రం అదనపు తరగతులను నిర్వహిస్తున్నారని చెప్పారు. బోధనేతర పనులతో ఉపాధ్యాయులకు మరింత భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శక్తిని అదనంగా 6 నుంచి 9వ తరగతుల వరకూ నిర్బంధంగా నిర్వహించాలని చూస్తే ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని వారు స్పష్టం చేశారు.

వద్దురొయ్య అంటే..!

- నిలకడ లేని ధరతో ప్రతికూల ప్రభావం
- అమెరికా టారిఫ్‌తో మరో రూ.30 పడిపోయిన వైనం
- అయినా.. సీడ్ వేసేందుకు చెరువులను సిద్ధం చేస్తున్న రైతులు

మలికిపురం: మూలిగే నక్కపై తాటిపండు పడినచందంగా ఉంది ఆక్వా రైతు పరిస్థితి. నిలకడ లేని ధర, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లతో ఆక్వా రైతులు కుదేలవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అమెరికా విధిస్తున్న టారిఫ్‌లు ఆక్వా రైతులను కుదుటపడనీయడం లేదు. ప్రధానంగా విదేశాలకు ఎగుమతి అయ్యే రొయ్యలను సాగు చేసే రైతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రస్తుతం రొయ్య ధర కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ రైతుల వద్ద సరకు లేదు. గత నెలలో కురిసిన వర్షాలకు వాతావరణ సమతుల్యత లోపించడంతో, తెగుళ్ల సమస్యతో రొయ్యలను ఇష్టానుసారం అమ్మేశారు. ఆగస్టు వరకూ వంద కౌంట్ రొయ్యలు తీసిన రైతు లేడు. వర్షాలు, ఎండల వల్ల సమతుల్యత దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. అధిక కూలింగ్ లేకుంటే, అధిక వేడి ఏర్పడింది. వేడిని తట్టుకునేలా రొయ్యలకు వాడేందుకు ప్రొ బయోటిక్స్ ఉన్నాయి కానీ, అధిక చల్లదనాన్ని నివారించేందుకు ప్రొ బయోటిక్స్ లేవని రైతులు అంటున్నారు. మారిన వాతావరణంతో రొయ్యల చెరువులు విబ్రియో వంటి వైరస్ బారిన పడ్డాయి. జిల్లాలో పది రోజులుగా పిల్ల వేసిన 20 రోజులకే చెరువులు వైరస్ బారిన పడుతున్నాయి. పూర్తి స్థాయి కౌంట్‌కు రాకుండా కూడా రొయ్య వైరస్ బారిన పడుతోంది. దీంతో కొన్నిచోట్ల చెరువులను ముందుగానే పట్టి రైతులు అయిన కాడికి అమ్ముకుంటున్నారు. లేదంటే నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని భీతిల్లుతున్నారు. పట్టుబడి పడుతున్న చెరువుల్లో 100 నుంచి 150 కౌంట్ కూడా ఉండడం గమనార్హం.

వేలాది ఎకరాల్లో నష్టం

ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది ఎకరాల్లో నష్టపోయిన రైతులు ఉన్నారు. రైతులు అందించిన వివరాల ప్రకారం, ఉమ్మడి జిల్లాలో గడచిన పది రోజుల్లో రొయ్య సీడ్ వేసిన నెల రోజులకే చెరువులను ఖాళీ చేశారు. మరలా సీడ్ వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. గత జూలై నెలలో 100 కౌంట్ రొయ్య ధర రూ.270 ఉంది. రెండు రోజుల క్రితం అమెరికా విధించిన సుంకంతో అది రూ.30 తగ్గి రూ.240కి పడిపోయింది. ఆశ చావని ఆక్వా రైతులు మరలా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.



తెగుళ్లు సోకిన రొయ్యలు

40 వేల ఎకరాల్లో సాగు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 72 వేల ఎకరాల్లో చెరువులు ఉండగా, సుమారు 40 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్నట్టు అంచనా. సీడ్ వేసిన అనంతరం రెండు నెలలు అన్నీ అనుకూలిస్తే 100 కౌంట్‌కు వస్తుంది. అలా జరిగి, రూ.240 ధర నిలకడగా ఉంటే రైతుకు పెట్టుబడి వస్తుంది. ప్రస్తుత పరిస్థితిలో 40 కౌంట్ కూడా తీసే రైతులు లేరు. అప్పటి దాకా ఉండాలన్నా, ధర ఎలా ఉంటుందో తెలియదు. పెట్టుబడి మాత్రం పెరుగుతుంది. ఓవైపు లీజులు మాత్రం చెల్లించాలి. పెద్ద రైతులకు కరెంట్ ఖర్చు తప్పదు. కూలి ఖర్చుల భారం పెరుగుతుంది.



దిండిలో సీడ్ వేసేందుకు సిద్ధమవుతున్న రొయ్యల చెరువులు

నిలకడ లేని ధరతో ఇబ్బందులు



తెగుళ్లు, నిలకడ లేని ధరతో ఇబ్బందులు పడుతున్నాం. గత నెల కౌంట్‌కు రాక రొయ్యను అర్ధంతరంగా పట్టేయాల్సి వచ్చింది. నష్టాలు అధికంగా చవిచూశాం. ప్రస్తుత వర్షాకాలం కూడా వాతావరణ సమతుల్యత ఏర్పడి, చెరువులు కౌంట్‌కు వచ్చే దాకా నమ్మకం ఉండదు.

– రుద్రరాజు చిన్నరాజా, ఆక్వా రైతు, గుడిమూల

సమతుల్యత లోపంతోనే ఇబ్బంది



వాతావరణ సమతుల్యతతో రొయ్యలకు ఇబ్బందులు వస్తాయి. వర్షాలు, ముసురు, ఎండలు ఒకేసారి రావడం వల్ల రొయ్య ఉక్కిరిబిక్కిరి అవుతుంది. చెరువుల్లో ఆక్సిజన్ తగ్గి, రొయ్యలకు తెగుళ్లు సోకుతాయి. ఎండలను తట్టుకునేందుకు ప్రొ బయోటిక్స్ అందుబాటులో ఉన్నాయి. అధిక శీతలానికి మందులు లేవు.

– సిద్ధార్థ వర్ధన్,
మత్స్య శాఖ అభివృద్ధి అధికారి,
రాజోలు

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్టు మహబూబాబాద్ డీఎస్పీ ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. టౌన్ ఎస్సై కె.శివ తన సిబ్బందితో కలిసి నర్సంపేట బైపాస్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా, బైక్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తారసపడ్డాడు. పోలీసులు ఆపగా, పారిపోయేందుకు యత్నించడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం ఎస్సీ పేట దేవీచౌక్‌కు చెందిన గొర్రెల చిన్నబాబుగా గుర్తించారు. గత మే 31న డోర్నకల్‌లో ఓ బైక్, మహబూబాబాద్‌లోని రామచంద్రాపురంలో 4.5 గ్రాముల బంగారం, 8 గ్రాముల వెండి ఆభరణాలు, ఆర్టీసీ కాలనీలో 4 గ్రాముల వెండి ఆభరణాలను అతడు తస్కరించాడు. చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నర్సంపేట, కోదాడ పట్టణాల్లో కూడా రెండు చోరీలకు పాల్పడినట్టు అతడు అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



దానయ్య మృతదేహం

పెరవలి: కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ పల్లా దానయ్య(42) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు, కేబుల్ వైర్ లాగటానికి విద్యుత్ స్తంభం ఎక్కిన అతడు విద్యుదాఘాతానికి గురై, స్తంభం పైనే చనిపోయాడు. స్తంభం ఎక్కినప్పుడు వైర్లు తగలడంతో అలాగే ఉండిపోయాడు. విద్యుత్ సరఫరా నిలిపివేశాక మృతదేహం కిందపడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, దానయ్యకు భార్య ధనలక్ష్మి, కుమారులు రామ సతీష్, గోపి సంతోష్ ఉన్నారు. భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆయన నిలువెత్తు బంగారం

- విద్యార్థుల ఆకలి తీరుస్తున్న బంగారు చినశోభనాద్రి సత్రం
- రెండు పూటలా విద్యార్థులకు భోజన సదుపాయం
- నిరుపేద వర్గాలకు ప్రాధాన్యం
- ప్రతి శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం
- వందేళ్లు దాటిన దాతృత్వపు చరిత్ర

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అలనాడు బాటసారుల కోసం ఏర్పాటు చేసిన సత్రం నేడు నిరుపేద విద్యార్థుల ఆకలి తీరుస్తోంది. కాకినాడ పెద్ద మార్కెట్ వద్దనున్న బంగారు చినశోభనాద్రి సత్రంలో దూర ప్రాంతాల నుంచి కాకినాడ వచ్చి ఉంటున్న నిరుపేదల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రుచికరమైన భోజనం ఈ సత్రంలో అందిస్తున్నారు. గతంలో ఈ సత్రంలో దూర ప్రాంతాల నుంచి కాకినాడకు వచ్చిన వారికి ఉచితంగా వసతి కల్పించేవారు. వారి సంఖ్య తగ్గిపోవడంతో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా పేద విద్యార్థులకు ఉచిత భోజనం అందిస్తున్నారు. గతంలో వివిధ హోటళ్ల పాస్‌లను విద్యార్థులకు అందించేవారు. హోటళ్ల భోజనం సక్రమంగా ఉండకపోవడంతో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు 2017 సత్రం ఆవరణలో అన్నదాన భవనం నిర్మించారు. ఇక్కడ సిబ్బందిని నియమించి భోజన వసతి కల్పిస్తున్నారు. కాకినాడ నగరంలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రాధాన్యమిస్తూ, వారి మెరిట్, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

101 ఏళ్ల చరిత్ర

ఈ సత్రానికి 101 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. ఈ సత్రాన్ని 1924లో బంగారు చినశోభనాద్రి నెలకొల్పారు. ఈ సత్రం కోసం ఆయన 65 ఎకరాల వ్యవసాయ భూమి, 2,800 చదరపు గజాల స్థలాన్ని ఈ సత్రానికి దానం చేశారు. అప్పట్లో దూర ప్రాంతాల నుంచి కాకినాడకు వచ్చిన రోగులకు, వ్యాపారులకు ఇక్కడ ఎటువంటి సదుపాయాలు ఉండేవి కావు. దీంతో శోభనాద్రి ఇక్కడ సత్రం ఏర్పాటు చేసి, వారికి ఆసరాగా నిలిచారు. వ్యవసాయ భూములు, దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని సత్రం నిర్వహణకు వినియోగిస్తున్నారు.

సమాజ సేవలు

ప్రస్తుతం విద్యార్థులకు ఉచిత భోజనంతో పాటు, సత్రం ఆవరణలో ప్రతి శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తున్నారు. ప్రతి శనివారం 120 నుంచి 150 మంది రోగులు ఇక్కడ వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు. ప్రతి వేసవిలో ఇక్కడ ఉచిత మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

నేటి నుంచి భోజనం

సత్రంలో మంగళవారం నుంచి విద్యార్థులకు భోజన వసతి కల్పించేందుకు సత్రం ఈవో విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆహ్వానించారు. ఇప్పటి వరకు 90కి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. నగరంలో ఏ కళాశాలలో చదువుతున్నారో ధ్రువీకరణ సత్రం, నిరుపేద కుటుంబాలు వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేసి, సత్రం కార్యాలయంలో దరఖాస్తు అందించాలి. అధికారులు వాటిని పరిశీలించి భోజన వసతి కల్పిస్తారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి కళాశాలలు మూసివేసే వరకూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తున్నారు.



పెద్ద మార్కెట్‌లోని బంగారు చినశోభనాద్రి సత్రం



చినశోభనాద్రి సత్రంలో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



ఉచిత హోమియో వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఇతర జిల్లాల విద్యార్థులకు ప్రాధాన్యం

కాకినాడలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్న శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం తదితర జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఎక్కువగా ఇక్కడ భోజన సదుపాయం కల్పిస్తున్నారు. విద్యార్థుల ఆదాయ ధ్రువీకరణ పత్రం ఆధారంగా వారికి సత్రంలో భోజనం అందిస్తున్నారు.

అర్హులైన విద్యార్థులందరికీ భోజన వసతి



దాత ఆశయాలకు అనుగుణంగా ఇక్కడ పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నాం. నిరుపేదలకు ఉచిత వైద్య సదుపాయం కూడా కల్పిస్తున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రాధాన్యమిస్తున్నాం. నిరుపేద విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. అర్హులైన విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ఏటా 150 మంది విద్యార్థులకు తక్కువ కాకుండా ఇక్కడ భోజన వసతి కల్పిస్తున్నాం. మంగళవారం నుంచి భోజన సదుపాయం ప్రారంభం కానుంది. విద్యార్థులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలి.

– చింతపల్లి విజయభాస్కర్ రెడ్డి, ఈవో, బంగారు చిన శోభనాద్రి సత్రం

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

పి.గన్నవరం: రామచంద్రపురంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పి.గన్నవరం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కలిగితి సందీప్ బాలుర అండర్–16 లాంగ్ జంప్‌లో ప్రథమ, 60 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానాలు సాధించాడు. దీంతో అతడిని ఈ నెల 9, 10, 11 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు హెచ్‌ఎం కె.ఉమాదేవి తెలిపారు. ఆమెతో పాటు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.దుర్గాప్రసాద్, కె.భీమేంద్ర తదితరులు సందీప్‌ను అభినందించారు.

కేశనపల్లి, బట్టేలంక విద్యార్థులు

మలికిపురం: రామచంద్రపురంలో ఎస్‌కేబీఆర్ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి వివిధ స్కూళ్లకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. కేశనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు 200 మీటర్ల రన్నింగ్‌లో ఎస్.సత్యసాయికృష్ణ, ప్రథమ, పి.అభిలాష్ తృతీయ, లాంగ్ జంప్‌లో ఎస్.సత్యసాయి కృష్ణ ద్వితీయ, పి.అభిలాష్ తృతీయ స్థానంలో నిలిచారు. సత్యసాయికృష్ణ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అలాగే బట్టేలంక ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.మోహన్, ఎ.గీతిక, జి.భార్గవి, పి.జ్యోతి, కె.ప్రసన్న, కె.శ్రీరామ్ వివిధ క్రీడాంశాల్లో ఎంపికయ్యారు.

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు స్థాని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.లక్ష్మీ ప్రసన్న, డి.దొనేశ్వర్ వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



సందీప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం ఉమాదేవి

విషాదంలో సీతారామ కాలనీ

- పోలీసుల అదుపులో నిందితుడు?
- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తింపు

సామర్లకోట: తల్లి, ఇద్దరు పిల్లల హత్య ఘటనతో పట్టణంలోని సీతారామ కాలనీలో సోమవారం నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. కూలీ పనులు చేసుకునే వారితో, పిల్లలు, పెద్దల అరుపులు, కేకలతో సీతారామ కాలనీ నిత్యం సందడిగా ఉంటుంది. ఇదే కాలనీలో నివసిస్తున్న ములపర్తి ధనుప్రసాద్ భార్య మాధురి(30), కుమార్తెలు పుష్పకుమారి(8), జెస్సీలోన(6)ను హత్యకు గురైన విషయం విదితమే. తొలుత ధనుప్రసాద్‌పై అనుమానంతో పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి పోలీసులు వివరాలు సేకరించారు. తన భార్య వద్ద ఉండాల్సిన బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్లు కనిపించలేదని అతడు పోలీసులకు తెలిపాడు. శనివారం రాత్రి ధనుప్రసాద్ ఏడీబీ రోడ్డు పనుల కాంట్రాక్టర్ వద్ద ఉన్నట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ హత్య కేసును వేగంగా ఛేదించాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేయడంతో.. పోలీసులు పలు బృందాలుగా ఏర్పడ్డారు. కాగా ధనుప్రసాద్ సమాచారం మేరకు మాధురి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడిని ప్రకాశం జిల్లా కనిగిరిలో గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. స్థానిక కోటపేటకు చెందిన తలే సురేష్ అనే వ్యక్తి మాధురిని, పిల్లలను హతమార్చినట్టు పోలీసుల విచారణలో వెలుగు చూసినట్టు సమాచారం. మరో వ్యక్తితో కూడా మాధురి వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్టు తెలుసుకున్న ప్రియుడు సురేష్.. ఆమెతో శనివారం రాత్రి ఘర్షణకు దిగినట్టు తెలిసింది. ఆ సమయంలో పిల్లలిద్దరూ నిద్ర లేచి వచ్చారు. ఘర్షణ సమయంలో మాధురి అందుబాటులో ఉన్న కర్రతో సురేష్‌ను కొట్టినట్టు తెలిసింది. అదే కర్రను అందిపుచ్చుకుని అతడు మాధురితో పాటు, పిల్లల తలపై బలంగా కొట్టి హతమార్చినట్టు సమాచారం. సురేష్ సొంత లారీపై డ్రైవర్‌గా పని చేస్తూ, తన సంపాదనతో ప్రియురాలికి కోరినవన్నీ కొనిపెడుతుండగా, మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, ఇది వద్దని చెప్పినా వినకపోవడంతోనే సురేష్ ఈ హత్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. భార్యాబిడ్డలు హత్యకు గురి కావడంతో ధనుప్రసాద్ సోమవారం స్పృహతప్పి పడిపోయాడు. అతడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో సీతారామ కాలనీ విషాదంలో మునిగిపోయింది.



తల్లీకూతుళ్ల హత్యలు జరిగిన ఇల్లు ఇదే..

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ కేవలం 7.5 లక్షలకే 25 సెంట్ల భూమి 100 ఎర్ర చందనం మొక్కలతో కలిపి స్పాట్ రిజిస్ట్రేషన్ మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎర్ర చందనం సాగు ఒక్కటే మార్గం. ✆ 96661 66407, 96031 84207 [B-2646]

■ రాజమండ్రి తూర్పు రైల్వేస్టేషన్ ఎదురుగా K.K.R గౌతం స్కూల్ దగ్గర 40X55 కొలతలతో W/F 245 చ॥గ॥లు స్థలం, GSL హాస్పిటల్ వెనుక సాయి నగర్ లో 200 చ॥గ॥లు 2 స్థలాలు అమ్మకమునకు కలవు. 98662 50279, 94926 69079, 93966 60652 [SCA25007015]

Services

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 81422 37635 [B-2647]

Wanted

■ కష్టలేని కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డ్రైవర్లు కావలెను. జీ: 15వేలు -40వేలు.ఫ్రీరూమ్+భోజనం.Hyd.9666253675 [HA-16118]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్లు సేవ వంట/ఇంటిపని బేబికేర్‌కై M/F వర్కర్స్ కా॥ భో+వ + జీతం 16–18 వేలు. ఏజెంట్లకు 5K కమీషన్. 9281465319/ 9515119570 [SCA25007009]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9949021122 [B-1275595]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
రీజనల్ సెంటర్లు
రాజమండ్రి: 99516 02906, 90101 20345
రాజానగరం: 97057 54205
అనపర్తి, మండపేట: 99516 02941
రామచంద్రపురం: 99516 02936
కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం: 98499 62678
తుని, జగ్గంపేట: 90109 67896
అమలాపురం: 97053 47414
రాజోలు, పి.గన్నవరం: 97053 46456
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కువైట్‌లో మగ్గిపోతున్నా.. స్వదేశానికి తీసుకెళ్లండి

కోనసీమ మహిళ వేడుకోలు



గుమ్మడి ధనలక్ష్మి

కొత్తపేట: కుటుంబ పోషణ కోసం విదేశానికి వెళ్తే, అక్కడ నిర్బంధించారని, పాలకులు దయతలచి స్వదేశానికి తీసుకువెళ్లాలని ఓ మహిళ వేడుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన గుమ్మడి ధనలక్ష్మి ఈ వీడియో విడుదల చేసింది. దీనికి సంబంధించి వీడియో, ఆమె అక్క కుమారుడు కొత్తపేట మండలం బిల్లకుర్రు శివారు చిక్కాలవారిపేటకు చెందిన చిక్కాల రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధనలక్ష్మి పుట్టిల్లు బిళ్లకుర్రు శివారు చిక్కాలవారిపేట కాగా, అత్తవారిల్లు ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం. సుమారు 16 ఏళ్ల క్రితం గుమ్మడి రాంబాబుతో వివాహమైంది. భర్త కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారి ఇద్దరు కుమారులు బీటెక్, ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. ఇలాఉండగా విదేశంలో కొన్నేళ్లు ఉపాధికి వెళితే కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ధనలక్ష్మి ఆశించింది. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం కువైట్‌లోని ఓ షేక్ ఇంట్లో పనికి కుదిరింది. రెండేళ్ల అనంతరం స్వదేశంలో భర్త, పిల్లలను చూసివస్తానని అడిగితే, అక్కడి వారు జాప్యం చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు రెండు నెలల క్రితం తాను వెళ్లిపోతానని పట్టుబడితే ధనలక్ష్మిని ఇంట్లో నిర్బంధించారు. తిండి కూడా పెట్టలేదు. ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకుని ఇండియన్ ఎంబసీకి చేరింది. కాగా ఆమె వాచ్ దొంగిలించి పారిపోయిందని షేక్ కేసు పెట్టడంతో, ప్రస్తుతం అక్కడే మగ్గుతోంది. ఈ నేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును ఉద్దేశించి తన దుస్థితిని వీడియో ద్వారా వెళ్లబోసుకుంది. ఆమె భర్త రాంబాబు, కుమారులు, బంధువులు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్‌ను కలిశారు. కువైట్‌లో మగ్గిపోతున్న ధనలక్ష్మిని ఇక్కడకు రప్పించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్టు రాజేష్ తెలిపారు.

మర్యాదలకు మారుపేరు కోనసీమ

- ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మనో
- మందపల్లి శనైశ్చరాలయంలో ప్రత్యేక పూజలు

కొత్తపేట: అతిథి మర్యాదలకు మారుపేరు కోనసీమ ప్రాంతమని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు నాగూర్ బాబు (మనో) అన్నారు. మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా మందపల్లి క్షేత్రాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం, తైలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన హరహర మహాదేవా శంభో.. కైలాసవాసా.. మందపల్లి మందేశ్వరా.. శనేశ్వరా.. అంటూ గానం ఆలపించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, వర్షాలు కురిసి చాలా రోజులైందని అంటుండగా, సరిగ్గా పూజలు జరుగుతున్నప్పుడు వరుణుడి ఆశీర్వాదంతో వర్షం కురవడం, శనైశ్చరుని మహిమ అని, తన జీవితంలో అద్భుత సంఘటన అన్నారు. శనిదోషం ఉన్నవారు మాత్రమే శనైశ్చరుని దర్శించుకోవాలనేది వాస్తవం కాదన్నారు. ప్రస్తుతం రజనీకాంత్ సినిమా సెన్సార్‌కు వెళుతుందని, రాత్రి డబ్బింగ్ చెప్పి ఫ్లైట్‌లో వచ్చానన్నారు. ఇక్కడి నుంచే డైలాగ్ చెప్పి వాట్సాప్‌లో పంపించానని తెలిపారు. ఈ కోనసీమ ఆప్యాయత, అనురాగాలకు పెట్టింది పేరన్నారు. తొలుత మనో, వారి కుటుంబ సభ్యులకు ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు, మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణమోహన్ స్వాగత మర్యాదలు చేశారు.



శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న మనో, కుటుంబ సభ్యులు

జనసేన నాయకుడిపై కేసు నమోదు

రాజోలు: పెట్రోల్ బంక్ యజమానిని బెదిరించిన జనసేన పార్టీ నాయకుడు శెట్టిం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్టు రాజోలు ఎస్సై రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. కడలి సెంటరులో ఉన్న నయారా పెట్రోల్ బంక్ యజమాని పప్పు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బంక్ స్థల యజమానికి పప్పు వెంకటేశ్వరరావుకు లీజుకు సంబంధించిన గొడవల్లో మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన శెట్టిం శ్రీనివాస్ తలదూర్చి వెంకటేశ్వరరావుపై బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నెల రెండున పెట్రోల్ బంక్ లోపలకు వాహనాలు పెట్రోలు, డీజిల్‌కు రాకుండా అడ్డంగా తాళ్లు కట్టేశాడు. తాము చెప్పినట్టు వినకపోతే పెట్రోలు బంక్ నడపనివ్వబోమని భయపెట్టినట్టు వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బు కోసం శ్రీనివాస్ బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలో మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి పోలీస్‌స్టేషన్లతో పాటు, రాజోలు సర్కిల్ కార్యాలయానికి పవన్‌కల్యాణ్ ఫొటో, జనసేన పార్టీ స్టిక్కరింగ్ కలిగి, సైరస్ ఉన్న తెల్ల రంగు కారులో వచ్చి, సెటిల్‌మెంట్లు, దందాలకు పాల్పడుతున్నాడన్నారు. అతని ఆగడాలు తట్టుకోలేక పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఇదే విషయమై జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కూ ఫిర్యాదు చేయనున్నట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.

క్రీడాస్ఫూర్తిని చాటిన హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలు సోమవారం క్రీడాస్ఫూర్తిని చాటాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు విజయం కోసం పోరాడారు. జమ్మూ–కశ్మీర్ జట్టుపై దాద్రానగర్ హవేలీ–డామన్ డయ్యూ 6–0 స్కోర్‌తో విజయం సాధించింది. రాజస్థాన్‌పై గుజరాత్ 3–2 స్కోర్‌తో, తెలంగాణపై మిజోరాం 15–0, పాండిచ్చేరిపై మణిపూర్ 9–1తో, కేరళపై అసోం 5–1 స్కోర్‌తో గెలుపొందారు. అలాగే హిమాచల్‌ప్రదేశ్‌పై న్యూఢిల్లీ 7–1 స్కోర్‌తో, అరుణాచల్‌ప్రదేశ్‌పై బీహార్ 1–0 స్కోర్‌తో విజయం సాధించాయి. సోమవారం మ్యాచ్‌లను రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు ప్రారంభించారు. టోర్నమెంట్ కో–ఆర్డినేటర్ రవిరాజు పోటీలను పర్యవేక్షించారు.



మ్యాచ్‌లో తలపడుతున్న అసోం, కేరళ క్రీడాకారులు

మాణిక్యాంబ అమ్మవారికి బంగారు చీర సమర్పణ



సంప్రోక్షణ పూజల్లో మాజీ మంత్రి వేణు, కుటుంబ సభ్యులు



మాజీ మంత్రి వేణు సమర్పించిన బంగారు చీర అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బంగారపు పూత ఉన్న కవచాన్ని సమర్పించారు. ముందుగా ఆలయంలో నంది మండపం వద్ద వేణు సతీమణి వరలక్ష్మి, కుమారుడు నరేన్, కోడలు శ్రవంతి, మనుమలు సునిధి, విరాజ్‌తో కలసి సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి బంగారపు చీరను సమర్పించగా, అర్చకులు అమ్మవారిని అలంకరించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, రామచంద్రపురం జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, సర్పంచ్‌లు యల్లమిల్లి సతీష్‌కుమారి, అనిశెట్టి రామకృష్ణ, పెమ్మిరెడ్డి దొరబాబు, కట్టా గోవిందు, అంబటి తుకారం, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

మామూళ్ల కోసం వేధింపులు

- మద్యం షాపులు మూసివేసి వ్యాపారుల నిరసన
- ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా

అమలాపురం టౌన్: ప్రతి నెలా మామూళ్లు ఇస్తున్నా.. అదనంగా పెంచాలని ఎక్సైజ్ అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అమలాపురం పట్టణ, రూరల్ మండలంలోని 13 లైసెన్స్ మద్యం షాపులను వ్యాపారులు సోమవారం మూసివేసి ఆందోళనకు దిగారు. షాపులకు తాళాలు వేసి, ఆ తాళాలను స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐకి అందించి నిరసన తెలిపారు. ఇలాగైతే తాము వ్యాపారాలు చేయలేమని ఎక్సైజ్ అధికారుల ముందే వ్యాపారులు అసహనం వ్యక్తం చేశారు. వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా కూడా చేశారు. మామూళ్లు పెంచాలని, లేని పక్షంలో షాపులపై కేసులు నమోదు చేస్తామని వేధిస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కార్యాలయంలో తొలుత సీఐ వీటీవీవీ సత్యనారాయణతో మద్యం వ్యాపారులు మాట్లాడారు. సీఐకి షాపుల తాళాలు ఇస్తూ, వ్యాపారాలు చేయలేమంటూ తెగేసి చెప్పారు. తర్వాత ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్‌తో భేటీ అయ్యారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ సత్యనారాయణను విలేకర్లు వివరణ కోరగా, వ్యాపారులకేదో సమస్య వచ్చిందని, అందుకే నిరసన తెలుపుతున్నారని, విషయం వారినే అడగాలన్నారు. మద్యం వ్యాపారులు కార్యాలయం ముందే ఆందోళనకు దిగడంతో అధికారులు కంగుతిన్నారు. వ్యాపారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసి, ఎట్టకేలకు ఆందోళనను విరమింపజేశారు. సోమ వారం సాయంత్రం నుంచి వ్యాపారులు షాపులను తెరవడంతో వివాదానికి తాత్కాలికంగా తెర పడింది. ఓ ప్రజాప్రతినిధి మద్యం షాపుల నుంచి మూ మూళ్ల కోసం డిమాండ్ చేస్తున్నారని తెలిసింది. మామూళ్లు తారా స్థాయికి చేరడంతో మద్యం వ్యాపారులు నిరసన బాట పట్టారంటున్నారు.



అమలాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మద్యం వ్యాపారులు